ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 29 సెప్టెంబరు 2025 | 5





లలితా త్రిపుర సుందరిగా దర్శనమిస్తున్న దేవిచౌక్ బాల త్రిపుర సుందరి



కరుణించు.. కనకదుర్గమ్మ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. పెద్ద ఎత్తున భక్తజనం తరలివస్తున్నారు. దీంతో జంక్షన్ జనంతో కిటకిటలాడుతోంది. ఆదివారం ఉదయం 108 మంది దంపతులు కుంకుమ పూజలు చేశారు. ఉత్సవంలో తప్పిపోయిన బాలుడిని సెంట్రల్ జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీకాంత్ చేరదీసి ధైర్యం చెప్పారు. కొద్ది సేపటి తర్వాత ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.







ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది..మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేస్తున్నారు. అనపర్తి శ్రీ శక్తి పీఠం ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ పూజలు చేసి కాలువలో నిమజ్జనం చేశారు.. రాజమహేంద్ర వరంలో పలువురు మహిళలు కలశాలతో భారీ ర్యాలీ చేశారు.గోదావరి జలాలు తీసుకెళ్లి అమ్మవారి అభిషేకించారు.

సచివాలయ ఉద్యోగుల ఉద్యమం కొనసాగిస్తాం

జిల్లా శాఖ ఛైర్మన్ రామదాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విలేజ్ వార్డ్ సెక్రటేరియట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ఆత్మగౌరవం కోసం పోరాటం కొనసాగిస్తామని ఆ శాఖ జిల్లా ఛైర్మన్ వి.రామదాసు స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం అర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం జరిగిన జిల్లా శాఖ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్బంధంగా అమలుచేస్తున్న ఇంటింటి సర్వేలు సచివాలయ ఉద్యోగులపై భారమై అనేక అవమానాలకు గురిచేస్తున్నాయన్నారు. సర్వేల నిలుపుదల జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.రవికుమార్, కె .వెంకటేశ్వరరావు, డి.భగవాన్‌దాస్, ఎం.ఇందిర , పి.గోపాలకృష్ణ ,కె.దినేష్, 19 మండల కమిటీల నాయకులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు గురైతే వైద్యం తప్పనిసరి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుక్క కరచిన వెంటనే వైద్యసాయం తీసుకోకపోతే రేబిస్ ముప్పు పొంచి అధికమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రపంచ రేబిస్ డేను పురస్కరించుకుని ఆదివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో వీధి కుక్కలతో పాటు ఇంటిలోని పెంపుడు కుక్కల కాట్లు పెరుగుతున్నాయన్నారు. రేబిస్ వ్యాధిపట్ల నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకమవుతుందన్నారు. తలనొప్పి, తీవ్రమైన జ్వరం, ఆందోళన, లాలాజల పక్షవాతం, గొంతు కండరాల సమస్యలు వంటి లక్షణాలు తుది దశలో ప్రాణాంతకమని హెచ్చరించారు.వైద్యశాఖ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



తగ్గేదేలే!

ఇంకనూ తగ్గని పన్నుపోటు

- ఆగని వ్యాపారుల దోపిడీ
- పాత ధరలే కొనసాగింపు
- దసరా ఆఫర్లుగా ప్రకటనలు
- ఎమ్మార్పీపై పాత జీఎస్టీ అమలు
- వారమైనా మారని పరిస్థితి
- తగ్గని పాల ప్యాకెట్ ధర
- తనిఖీలు చేపట్టని అధికారులు
- అవగాహన సదస్సులతో సరి
- మోసపోతున్న కొనుగోలుదారులు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వచ్చి వారం దాటింది. ఈ నెల 22 నుంచి సుమారు 83 కేటగిరీలకు సంబంధించిన వస్తువులు,సేవలు, మందులపై కేంద్రం జీఎస్టీ శ్లాబ్ తగ్గించిన సంగతి తెలిసిందే. గతంలో నాలుగు శ్లాబ్‌లు ఉంటే.. ప్రస్తుతం రెండు శ్లాబ్‌లకే పరిమితం చేశారు. కానీ ఎక్కడా ఇవి పూర్తి స్థాయిలో అమల్లోకి రావడంలేదు. వ్యాపారులు అసలు ధరలు చెప్పడం లేదు. పాత సరుకు ఉందనే కారణంతో పాత ధరలే వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ పరి స్థితుల్లో పాత సరుకు ఎంత ఉందో చెప్పే వారెవరూ కనిపించడంలేదు. తగ్గిన జీఎస్టీ శ్లాబ్ వల్ల ప్రజలకు ఎప్పటికి ప్రయోజనం లభిస్తుం దనేదానిపై స్పష్టత లేదు.

దసరా ఆఫర్ల పేరు..

టీవీలు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, మోటారు సైకిళ్లపై కొంత వరకూ తగ్గినట్టు చెబుతున్నారు. కార్లపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ తగ్గగా మోటారు సైకిళ్లపై రూ.15 వేల వరకూ తగ్గింది. టీవీలపై రూ.3 వేల నుంచి రూ. 4 వేల వరకూ తగ్గిస్తున్నారు. కానీ ఇవన్నీ దసరా ఆఫర్లతో కలిపి అమ్ముతున్నట్టు వ్యాపారులే చెబుతున్నారు. అంటే దసరా ఉత్సవాల తర్వాత టీవీలు, ఏసీల వంటి ధరలు కొద్దిగా పెరిగే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. సిమెంట్ ధరలు తగ్గించడం లేదు. పాల ఉత్పత్తుల వద్ద ధరల పట్టీలు పెట్టారు. కానీ పాత సరుకు ఉందని చెప్పడం గమనార్హం.

కొత్త పథకం.. పాత ధర..

ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించిన 83 కేటగిరీల వస్తువులు, సేవలు వంటి వాటి వివరాలు ప్రకటిం చింది.వీటి ధరలు కచ్చితంగా తగ్గించాల్సిందే. పన్నీరు, టెట్రాప్యాక్ పాలు, చపాతీలు, రోటీలపై ఐదు శాతం జీఎస్టీ ఉండేది. దానిని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే వ్యాపారులు మాత్రం పాత ధరకే విక్ర యిస్తున్నారు.వెన్న, నెయ్యి, తృణధాన్యాలు, చక్కెర, కాఫీ, సూప్‌లు, బేకింగ్ పౌడర్, నిల్వ ఉంచిన చేప, మాంసం రేటపై జీఎస్టీ గతంలో 12 శాతం ఉండేది. ప్రస్తుతం కేవలం 5 శాతం వసూలు చేయాలి. 20 లీటర్ల తాగునీటి డబ్బాలు, కొబ్బరిపాలు, బాదం, జీడి పప్పు పాలు, అవిసెపాలు, బియ్యంపాలు , ఓట్ పాలు పండ్ల గుజ్జు, రసాలు, పాలు ఆధారిత పానీయా లపై గతంలో 18 శాతం జీఎస్టీ వసూలు చేసేవారు. ఈ శ్లాబ్‌ను 5కి పరిమితం చేశారు.

అసలు ఎంత తగ్గాయంటే!

- విద్యార్థులు ఉపయోగించే వ్యాయామం, ఎరేజర్లు, పుస్తకాలు, పెన్సిళ్లపై జీఎస్టీని ఎత్తేశారు.జామెట్రీ, రంగు పెట్టెలు,పేపరు కార్టూన్లు తదితర వస్తువులపై 12 శాతం ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.
- అరుదైన వ్యాధులకు సంబంధించిన మందు లపై పూర్తిగా జీఎస్టీ ఎత్తేశారు. యునాని, సిద్ధ, హోమియోపతి సహా అన్ని మందులు, ఆక్సిజన్ కిట్లు, రసాయనాలు,గ్లూకోమీటరు,సర్జికల్ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.థర్మామీటరుపై 18 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- వ్యవసాయ పరికరాలు,యంత్రాలపై గతంలో 12, 18 శాతం జీఎస్టీ ఉండేది.. మొత్తం 5 శాతానికి తగ్గించారు. వ్యవసాయ సంబంధిత పరికరా లు ఏం కొన్నా 5 శాతమే వసూలు చేయాలి.
- వాహనాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. సైకిళ్లు,వాటి భాగాలపై 12 శాతం ఉంటే 5శాతానికి పరిమితం చేశారు.
- సిమెంట్‌పై జీఎస్టీ 28 శాతం ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. మిగిలిన గృహ నిర్మాణ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- టీవీలు, ప్రొజెక్టర్లు, ఏసీలు, డిష్ వాషర్లపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే దానిని 18 శాతానికి పరిమితం చేశారు.సోలార్ వాటర్ హీటర్, సిస్టమ్స్ ,సోలార్ కుక్కర్లపై 12 శాతం ఉంటే 5శాతానికి పరిమితం చేశారు.
- బొమ్మలు, క్రీడాపరికరాలు, చేతిపనుల వస్తువులపై 5 శాతమే.
- ఫీడింగ్ బాటిళ్లు,స్టీల్, అల్యూమినియం, రాగి వంటి పాత్రలు, ఫీడింగ్ బాటిళ్లు, బేబీ న్యాప్ కిన్‌లు,డైపర్లు, కొవ్వొత్తులు, స్టీలు, అల్యూ మినియం,రాగి ఇత్తడి,వంటగది పాత్రలు,కుట్టు యంత్రాలు, రబ్బరు బ్యాండ్లపై 12 శాతం జీఎస్టీని 5శాతానికి పరిమితం చేశారు.
- కాఫీ, చాకెట్లు, పేస్ట్రీ, కేక్‌లు, బిస్కెట్లు, జామ్‌లుపై గతంలో 18శాతం జీఎస్టీ ఉండేది.దానిని 5 శాతానికి పరిమితం చేశారు.బాదం, పిస్తా, హాజెల్ నట్స్, ఖర్జూరం, అంజీర్ మొదలైన డ్రైఫ్రూట్లు, పాస్తా,మాకరోనీ, నూడుల్స్, ఊరగాయలు, పండ్లు, కూరగాయల రసాలపై గతంలో 12 శాతంగా ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.
- సబ్బులు,హెయిర్ ఆయిల్, షాంపూలు, దువ్వెనలు, పౌడర్లపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గింది. టాల్కర్, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్ షేవ్ లోషన్లపై 18 శాతం ఉంటే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు. పన్ను తగ్గించినా వ్యాపారులు ఇంకా పాత పన్ను విధానమే అనుసరిస్తున్నారు.



18 వరకూ అవగాహన సదస్సులు

ఏ వస్తువుపై ఎంత జీఎస్టీ అనేది ప్రభుత్వం ప్రకటించింది. వినియోగదారులు వాటి పట్ల అవగాహన చేసుకుంటే మార్కెట్‌లో ఏ వస్తు వుకు ఎంత తగ్గిందో అడిగి కొనుక్కోవచ్చు. 22వ తేదీకి ముందు ఎమ్మార్పీని ఇవాళ ఉన్న ఎమ్మా ర్పీతో అవగాహన చేసుకుంటే వ్యాపా రులు దిగొస్తారు.లేకపోతే దోపిడీ తప్పదు. ఈ మేరకు అధికార యంత్రాంగం అవగాహన సదస్సులు చేపడుతోంది. వచ్చే నెల 18వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది.19న సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరిట దీపావళిని ఒకరోజు ముందుగానే నిర్వహించనున్నారు.



ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు సమ్మె నోటీస్ అందజేస్తున్న వైద్యులు

నేడు పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

సమ్మెలోకి ఆసుపత్రుల వైద్యులు

నల్లజర్ల,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) విధిలేని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళుతున్నట్టు నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధర్, డాక్టర్ సిరాజుద్దీన్ తెలిపారు.తమ సమస్యలతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు అందజేసి మాట్లాడారు. జీవో నెంబరు 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని,అలవెన్స్‌లు అందించాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్ చేస్తున్నామన్నారు. 30,1న జిల్లా కేంద్రాల్లో నిరసనలు, 3న విజయవాడలో నిరసన, నిరహార దీక్షలు చేస్తామన్నారు. కార్య క్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్, మండల స్థాయిల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ సమస్యలు,అభ్యర్థనలు మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల స్వీకరణకు రాత సహాయకులు,రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.



ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

పోటీలు హోరాహోరీగా సాగాయి.. క్రీడాకారులు నువ్వా నేనా అంటూ తలపడ్డారు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2025 ముగిశాయి. మహిళల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సూర్య చరిష్మా , పురుషుల సింగిల్స్‌లో భరత్ రాఘవ్ విజయం సాధించారు. ఆదివారం సాయంత్రం ఫైనల్ పోటీలు జరిగాయి. విజేతలకు శాప్ ఛైర్మన్ రవినాయుడు బహుమతులు అందజేశారు.

అపూర్వ కలయిక!

వాళ్లంతా స్నేహితులే.. 21 ఏళ్ల కిందట 1999 నుంచి 2004 వరకూ గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు.. తరువాత కొంత మంది కలిసి చదువుకుంటే.. మరికొంత మంది వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు.. దసరా సందర్భంగా ఆదివారం కలుద్దామని అనుకున్నారు.. సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 20 మాస్టార్లను సత్కరించారు. సాయంత్రం వెళ్లొస్తాం అంటూ కన్నీటిని దాచుకుంటూ ఎవరికి వారు ఇళ్లకు పయనమయ్యారు. - గోకవరం



తగ్గని గోదావడి!



పుష్కరఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

- ఉధృతంగా గోదావరి
- కొనసాగుతున్న ఫస్ట్ వార్నింగ్
- మరో రెండు రోజులు వరద
- ఎగువున వర్షాలే కారణం

రాజమహేంద్రవరం/కొవ్వూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గోదావరి ఇంకా ఉధృతంగానే ప్రవహిస్తోంది. అఖండ గోదావరి ఘాట్లన్నీ వరద నీటితో నిండి ఉన్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. అఖండ గౌతమీ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. స్నానఘట్టాల మెట్లను ముంచుతూ, సుడులు తిరుగుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాలపై ఉన్న శివలింగాలను వరద ముంచెత్తింది. భద్రాచలం నుంచి వరద ప్రవాహం ధవళేశ్వరం బ్యారేజ్‌కు చేరుకోవడానికి 18 గంటల సమయం పడుతుంది.ధవళేశ్వరం వద్ద నెమ్మదిగా తగ్గుముఖం పడుతోంది. మొదటి ప్రమాద హెచ్చరిక ఇంకా అమల్లోనే ఉంది. బ్యారేజీ వద్ద ఆదివారం ఉదయం 6 గంటలకు 12.50 అడుగులుగా ఉన్న నీటిమట్టం నెమ్మదిగా తగ్గుతూ రాత్రి 8 గంటలకు 12 అడుగులకు చేరింది.సోమవారం ఉదయానికి మొదటి ప్రమాద హెచ్చరిక ఎత్తివేసే అవకాశం ఉంది.బ్యారేజి నుంచి దిగువకు 10 లక్షల, 9 వేల 208 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం ఇద్దరు భవానీ మాలధారులు గల్లంతు కావడంతో ఘాట్ల వద్ద అధికారులు అప్రమత్తమయ్యారు. ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రమాద హెచ్చరిక ఎత్తివేసినా ఇంకా కనీసం రెండు రోజుల పాటు ఈ ఉధృతి కొనసాగే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.



ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి



ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు

ఇంకనూ లభించని ఆచూకీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పుష్కరాల రేవు వద్ద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన భవానీమాలధారుల కోసం అగ్నిమాపక శాఖ సిబ్బంది,మత్స్యకారుల సహకారంతో గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది.మాలధారులు వీరబాబు, బాపిరాజు శనివారం సాయంత్రం గోదావరిలో గల్లంతైన విషయం విదితమే. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పుష్కరాల రేవు వద్ద వారి బంధువులు గల్లంతైన వారి కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఆదివారం రాత్రి వరకు రాలేదు. గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో పుష్కరాల రేవు నుంచి దిగువకు గాలింపు చర్యలు చేపడుతున్నారు.పుష్కరఘాట్‌ను ఆదివారం రాజమహేంద్రవరం, అనపర్తి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్,నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు.గోదావరికి వరద ఎక్కువగా ఉన్నందువల్ల స్నానాలకు వచ్చే భక్తులు మునిసిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ట్యాప్‌ల వద్ద స్నానాలు చేయాలని తెలిపారు.అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

అంతర్జాతీయ క్రీడలకు వేదికగా రాజమహేంద్రవరం

శాప్ చైర్మన్ రవినాయుడు

ముగిసిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్


సింగిల్స్‌లో రన్నర్‌గా నిలిచిన రావత్‌కు బహుమతి ప్రదానం


విన్నర్‌గా నిలిచిన సూర్యచరిష్మా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్రీడలకు రాజమహేంద్రవరం వేదిక కావాలని శాప్ చైర్మన్ ఏ.ర వినాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ బ్యాడ్మింటన్ కోర్టుల్లో నిర్వహించిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2025 ఫైనల్స్ పోటీలు ఆదివారం సాయంత్రం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథి శాప్ చైర్మన్ రవినాయుడు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. రవినాయుడు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి శాప్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి పాలనలో క్రీడాకారులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని, ఆటలకు ప్రోత్సాహం అందజేస్తున్నారన్నారు. జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

మహిళల సింగిల్స్ విజేత సూర్యచరిష్మా

మహిళల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సూర్యచరిష్మా విజేతగా నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో భరత్ రాఘవ్ విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో సూర్య చరిష్మా 21-14, 21-22 స్కోర్ల తేడాతో హర్యానాకు చెందిన జియా రావత్‌పై గెలుపొందింది. పురుషుల సింగిల్స్‌లో హర్యానాకు చెందిన భరత్ రాఘవ్ అదే రాష్ట్రానికి చెందిన రవిపై గెలుపొందాడు. అలాగే, పురుషుల డబుల్స్‌లో నిషాత్ దురైస్వామి (తమిళనాడు), ప్రేజాన్ జోడీ అక్షన్ షెట్టి (మహారాష్ట్ర), శంకర్‌ప్రసాద్ ఉదయ్ కుమార్ (కేరళ)పై గెలిచారు. మహిళల డబుల్స్‌లో రుతపర్ణ పాండా (ఒడిశా), దీప్‌షికా సింగ్(ఢిల్లీ) జోడీ పవిత్ర నవీన్, గౌరీ కృష్ణ (కేరళ) 23-21, 24-22పై విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో దీప్ రాంభియా, సోనాలి మీర్‌ఖేల్కర్ (మహారాష్ట్ర) జోడీ ధ్రువ్ రావత్ (ఉత్తర్ ప్రదేశ్), మనీషా (ఆర్‌బీఐ)పై గెలుపొందారు.

అద్వితీయం... మహాశక్తి యాగం

ఏడో రోజు శ్రీపీఠానికి పోటెత్తిన మహిళలు

వారాహీదేవిగా ఐశ్వర్యాంబిక దర్శనం


లలితా సహస్రనామ సామూహిక కుంకుమార్చనలో మహిళలు


విశేషాలంకరణలో వారాహి అమ్మవారు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో 3వ మహాశక్తి యాగం ఆదివారం ఏడోరోజుకు చేరుకుంది. ఐశ్వర్యాంబిక అమ్మవారు వారాహీదేవిగా విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారికి వారాహి, కీలక స్తోత్ర హోమాలను పలు విశేష ద్రవ్యాలతో నిర్వహించారు. వంద కోట్ల కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు శ్రీపీఠం వ్యవస్థాపకులు స్వామి పరిపూర్ణానంద సరస్వతి అనుగ్రహ భాషణ చేశారు. నిత్యం 24 నిమిషాలు కేటాయించి లలితా సహస్రనామం పారాయణం చేయడం అలవరుచుకోవాలన్నారు. కంఠస్థం, హృదయస్థం చేసిన పారాయణతో కుంకుమార్చన చేస్తూ అమ్మవారిపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. లలితా నామాన్ని ఉచ్చరించే సమయంలో పొత్తి కడుపు నుంచి మెదడు దాకా నాడులు యాక్టివేట్ అవ్వడం ద్వారా ఉత్సాహంగా, ఆరోగ్యంగా జీవించడంతో పాటు కోరిన కోర్కెలు నెరవేరేలా అమ్మ అనుగ్రహం ఉంటుందన్నారు. త్వరలో సుమారు 108 అడుగుల ఎత్తులో అమ్మవారి విగ్రహంతో పాటు మహాశక్తి దీపం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. యాగం నిర్వహణకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది, అధికారులు విశేషంగా సహకరిస్తున్నారన్నారు. సుమారు 35వేల మంది భక్తులు పాల్గొన్నారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు పి.శ్రీనివాసకుమార్, ఆచార్యులు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారి పూలదండ రూ.లక్షా 5 వేలు!


మహిషాసుర మర్ధని అమ్మవారు

అమలాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన మహిషాసుర మర్ధని అమ్మవారికి మెడలో అలంకరించే పూల దండ వేసేందుకు అనుమతి కోసం ఆదివారం ఉత్సవ కమిటీ నిర్వహించిన బహిరంగ వేలంలో ఒకరు రూ.లక్షా 5వేలకు పాట పాడి దక్కించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రవణం వీధిలో ఉన్న శ్రీమహిషాసుర మర్ధని అమ్మవారిని కి దసరా రోజు నిర్వహించే భారీ ఊరేగింపులో అమ్మవారి అలంకరణలో భాగంగా భారీ గజమాలను ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా బహిరంగ వేలం ద్వారా హైదరాబాద్‌లో ఉంటున్న ఆకుల లక్ష్మణరావు దక్కించుకున్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాల్ ద్వారా బహిరంగ వేలంలో పాల్గొని పూల దండ వేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. అమ్మవారి మెడలో పూలదండవేస్తే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకంతో ఆరోజు దండ వేసేందుకు చాలామంది పాటలో పాల్గొని పోటీపడి దక్కించుకోవడం ఆనవాయితీగా మారింది.

జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ స్వామి, పురుషుల కబడ్డీ పోటీల దృశ్యం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామి

పెదపూడి (కరప), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీ స్వామి సూచించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నన్నయ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో 395 గుర్తింపు పొందిన కళాశాలలున్నాయన్నారు. ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ యూనివర్సిటీలో క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అక్టోబరు 4నుంచి 7వరకు కర్ణాటకలోని బెల్గాంలో గల రాణిచెన్నమ్మ యూనివర్సిటీలో జాతీయ స్థాయి యూనివర్సిటీల గేమ్స్-స్పోర్ట్స్ మీట్ జరగనుందని, ఇందులో నన్నయ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ జట్టు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. గొల్లల మామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ-కరస్పాండెంట్ డీఆర్కే రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో జనిగూ పోటీల్లో కబడ్డీ జట్టు గోల్డ్ మెడల్ సాధిస్తే క్రీడాకారులకు తమ సంస్థ తరఫున మంచి ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోటీలను ప్రారంభించి సత్తా చాటిన క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసరెడ్డి, ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షురాలు ద్వారంపూడి చంద్రావతి, డీఆర్కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివన్నారాయణరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.త్రివేణి, జీఆర్ఎస్‌పి అధ్యక్షుడు డి.భాస్కర్‌రెడ్డి, పరిశీలకుడు మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులు శ్రీనివాస్‌కుమార్, శ్రీనివాసరావు, కార్యనిర్వాహకకార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా యానాం వెంకన్న కల్యాణం


వెంకన్న కల్యాణోత్సవ వేడుకల దృశ్యాలు



యానాం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యానాం ప్రజల ఆరాధ్యదైవం శ్రీభూసమేత వేంకటేశ్వరుని కల్యాణోత్సవం మంగళవారం సంప్రదాయ రీతిలో వైభవంగా జరిగింది. కల్యాణ వేడుకను కరకుదురుకు చెందిన ఆగమ పండితులు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి బాలలాయంలో శాస్త్రోంతంగా జరిగిన ఈ కల్యాణోత్సవంలో యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఆలయ ఈవో జ్యోతి వెంకటేశ్వరరావు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తాలంబ్రాలును సమర్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ట్రాక్టర్ ఢీకొని పాస్టర్ మృతి


ఏసురత్నం (ఫైల్)

గొల్లప్రోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దైవ ప్రార్థనల కోసం చర్చికి వస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పాస్టర్ చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని అగ్రహారానికి చెందిన దేవాది ఏసురత్నం (74) పాస్టర్‌గా ఉంటూ చర్చి ల్లో ప్రార్థనలు నిర్వహిస్తారు. గొల్లప్రోలులోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించేందుకు ఆదివారం ఉదయం స్కూటర్‌పై ఇంటి నుంచి బయల్దేరాడు. గొల్లప్రోలు బైపాస్‌లో వై.జంక్షన్ పెట్రోలు బంకు సమీపంలోకి వచ్చేసరికి పిఠాపురం నుంచి కత్తిపూడి వెళ్తున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఏసురత్నానికి తీవ్ర గాయాలు కాగా తొలుత పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. ఏసురత్నానికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


ఆలమూరు మండలం జొన్నాడ వద్ద మృతిచెందిన మహిళ

ఆలమూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ, చొప్పెల్ల గ్రామాల వద్ద జాతీయ రహదారిపై జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన వెలగపు సుజాత(45), భర్త సూరిబాబుతో కలసి బైక్‌పై కపిలేశ్వరపురం ఏటిగట్టుపై నుంచి వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి రాజోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొంది. సుజాత తలపై నుంచి బస్సు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆలమూరు ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు ఆలమూరు ఎస్‌ఐ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం మోరంపూడికి చెందిన పసుపులేటి వేణుగోపాలరావు (47) ప్రతీ శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రోజ్‌మిల్క్ వ్యాపారం చేస్తుంటాడు. శనివారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్టు ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు నమోదు చేశామన్నారు.

లారీని ఢీకొని యువకుడు..

రాజోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ములికిపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కలగంపూడికి చెందిన కడలి అక్షయ్ (21) ఆదివారం మృతిచెందాడని రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. అక్షయ్ చెన్నైలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. చెన్నై నుంచి కలగంపూడి వచ్చిన అక్షయ్ స్నేహితుడిని కలిసేందుకు కడలి మీదుగా ములికిపల్లి వెళ్తుండగా నలంద పబ్లిక్ స్కూలు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల



జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

మోతుగూడెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను ఆదివారం ఉదయం 5వేల క్యూసెక్కులకు పెంచినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1035.60 అడుగులకు చేరుకోవడంతో జెన్‌కో అధికారులు జలాశయం ప్రమాదస్థాయికి చేరుకోకుండా 1035.60 వద్ద నీటి మట్టం స్థిరంగా కొనసాగేలా దిగువకు 3వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే ఎగువున కురుస్తున్న వర్షాలకు జలాశయానికి ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఉదయానికి జలాశయం నీటి మట్టం 1035.70 అడుగులకు పెరగడంతో జెన్‌కో అధికారులు నీటి విడుదలను మూడు వేల క్యూసెక్కుల నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచారు. జలాశయంలోని 7వ నెంబర్ గేటును 2.90అడుగులు ఎత్తి 3వేల క్యూసెక్కులు, 6వ గేటు ద్వారా 1.84 అడుగులు ఎత్తి 2వేలు క్యూసెక్కులు మొత్తంగా 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు జెన్‌కో అధికారులు విడుదలచేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ముగ్గురిపై కేసు

బిక్కవోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు నుంచి భీమవరం వద్ద ఉండి చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తీసుకువెళ్తున్న వ్యాన్ డ్రైవర్, క్లీనర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున బిక్కవోలులోని కాటన్ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలను గుర్తించారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్ కాకినాడ జిల్లా కాజులూరు మండలం తిప్పరాజుపాలెంకు చెందిన చెయ్యేటి నరేంద్ర, బిక్కవోలు మండలం ఆరికిరేవులకు చెందిన వారా క్రాంతిలను అరెస్టు చేసి వ్యాన్ సీజ్ చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. అలాగే వ్యాన్ యజమాని కామర్తి దుర్గాప్రసాద్‌పై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు.

చింతలూరులో కొండచిలువ హల్‌చల్



ఆలమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొండలు, అడవి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే కొండచిలువ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో హల్‌చల్ చేసింది. ఆదివారం చింతలూరు కాలువ వద్ద కనిపించడంతో అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా భయభ్రాంతులయ్యారు. చివరికి దానిని హతమార్చారు. అటవీప్రాంతంలో ఉండే కొండచలువ ఇక్కడకు రావడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కొండచలువ సుమారు 8 అడుగుల పొడవు ఉన్నట్టు తెలిపారు. అయితే కొండల వద్ద నుంచి వస్తున్న గ్రావెల్ లారీల ద్వారా కొండచలువ వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు.

రాయవరంలో ఆలయ స్థలం వివాదం

ఒక వర్గంపై రాళ్ల దాడి

గాయపడి ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు


మృతిచెందిన సత్యనారాయణ (ఫైల్)


రాయవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

రాయవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలమ్మ ఆలయం సమీపంలో ఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయం వద్ద షెడ్డు నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆలయ సరిహద్దు ఇంట్లో ఉన్న వ్యక్తి, అతడి కుటుంబ సభ్యులు రాళ్ల దాడికి పాల్పడిన సంఘటనలో వ్యక్తి త్రీవంగా గాయపడి మృతి చెందగా మరో ఏడుగురు వ్యక్తులు గాయాలపాలై చిక్సిత పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరంలో శ్రీపోలమ్మ ఆలయం పక్కనే ము త్యాలమ్మ ఆలయం ఉంది. ఆలయ సరిహద్దులో రేలంగి నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇళ్లు ఉంది. ఆలయ నిర్వహక కమిటీకి, సరిహద్దులో ఉన్న నాగేశ్వరరావుకు గత కొన్నేళ్లుగా సరిహద్దు వివాదం నడుస్తుంది. ఆలయం వద్ద ఉన్న స్థలం తనది అంటూ నాగేశ్వరరావు, స్థలం ముత్యాలమ్మ ఆలయానిదే అంటూ ఆలయ నిర్వహకులు చెబుతుండటంతో వివాదం నడుస్తుంది. పోలమ్మ ఆలయ నిర్వహకులు ఆలయం వద్ద స్థలంలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో వివాదం జరగడంతో నాగేశ్వరరావు అతడి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నుంచి కారం నీళ్లు చల్లి రాళ్లతో ఆలయ షెడ్డు నిర్మాణం చేస్తున్న కమిటీ, షెడ్డు వద్ద వ్యక్తులపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గ్రామానికి చెందిన బోదంకి సత్యనారాయణ (51) అలియాస్ సత్తిబాబు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందాడు. మరో ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. దాడి చేసిన రేలంగి నాగేశ్వరరావు పరారీలో ఉన్నట్టు సమాచారం.

డీఎస్పీ పరిశీలన

రాయవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద రాళ్ల దాడి జరిగిన ప్రాంతాన్ని రామచంద్రపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పరిశీలించారు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్‌ఐ డి.సురేష్ బాబు వివాదంపై ఆరా తీశారు. రాయవరం పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

రావులపాలెం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం


అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన చాంబర్ అధ్యక్ష,పాలకవర్గ సభ్యులు రావులపాలెం అభివృద్ధికి కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ ఫంక్షన్‌హాలులో రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు పాల్గొని అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డితో పాటు నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యక్తికో ఒక వర్గానికో చెందినది కాదని, అందరూ సమష్టిగా ఏర్పాటు చేసుకున్న సంఘమన్నారు. వినియోగదారులకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయ్యాలన్నారు. చాంబర్ అధ్యక్షుడు, రాజపురస్కార అవార్డు గ్రహీత పోతంశెట్టి కనికిరెడ్డి మాట్లాడుతూ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పాలకవర్గ సభ్యుల సమన్వయంతో చాంబర్ భవన ఆధునీకరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యాపారులు వినియోగదారులతో సమన్వయంగా పనిచేస్తు వ్యాపారాలు సాగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్, తమలంపూడి రామకృష్ణరెడ్డి, చిన్నం శ్రీనివాసరెడ్డి, సాదనాల శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు. చాంబర్ అధ్యక్షుడిగా నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన పోతంశెట్టి కనికిరెడ్డిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట కర్రి నాగిరెడ్డి తదితరులున్నారు.

ఆకర్షణీయంగా..

అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ప్రధాన సెంటర్‌లో తమిళనాడుకు చెందిన వివిధ జాతుల రకాల పక్షులను విక్రయిస్తున్నారు. ఫ్రెంచ్, టర్కీ బాతులు, కడకనాథ్, చీటా కోళ్లు, గిన్నె కోళ్లు ఉన్నాయి. దీంతో వీటి కోసం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. - ఎటపాక (ఆంధ్రజ్యోతి)



రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

మహాచండీదేవిగా దర్శనమిచ్చిన జగజ్జనని

దివాన్‌చెరువు, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రిమహోత్సవాలు ఏడోరోజైన ఆదివారం లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలోని బాలా త్రిపురసుందరి అమ్మవారు, స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయ సముదాయంలో ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారు శ్రీమహాచండీదేవిగా దర్శనమిచ్చారు. ఎనిమిదో రోజైన సోమవారం మూలానక్షత్రం సందర్భంగా ఆలయంలో దాదాపు 100 మంది విద్యార్థులతో సరస్వతీపూజ నిర్వహిస్తారని ఆలయ అర్చకులు పులగుర్త కిషోర్ తెలిపారు.

ఓం శివశక్తిపీఠంలో శరన్నవరాత్రులు

కోరుకొండ(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదరాడ ఓంశివశక్తిపీఠంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దసరా సందర్భంగా అమ్మవారికి ఏడు రోజులుగా రోజుకో అలంకరణలో అమ్మవారిని అలంకరిస్తున్నామని సోమవారం అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రం కావడంతో అమ్మవారిని సరస్వతి దేవి అలంకరణలో దర్శనమివ్వనున్నట్లు ఎమ్మెల్యే సోదరుడు, కోరుకొండ ఏపీసీఎస్ అధ్యక్షుడు బత్తుల గోపాలకృష్ణ తెలిపారు. కాపవరం గ్రామంలో శనివారం బీజేపీ రాజానగరం నియోజకవర్గ ఇన్ చార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ కమిటీ వంశ పారంపర్య ధర్మకర్త నీరుకొండ బాబ్జి, ఇతర కమిటీ సభ్యులు వీరన్న చౌదరికి అమ్మవారికి శేషమాల, శేష వస్త్రం బహూకరించారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో మధ్యరా మాలయంవద్ద నెలకొల్పిన కనకదుర్గమ్మ గ్రామోత్సవం ఆదివారం కన్నులపండువగా నిర్వహించారు. అమ్మవారి ముందు ఐదు వందలకుపైగా భవానీలు కలశాలు ధరించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

గోకవరం(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని వీరభద్రుని గద్దెలో ఏడో రోజైన ఆదివారం అమ్మవారు మహచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘ మహి ళలు అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు.

హరిహర క్షేత్రంలో అపర్ణాదేవికి పూజలు

కడియం(ఆంధ్రజ్యోతి): కడియపులంక హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీఅపర్ణాసమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో అపర్ణాదేవికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అగ్నిగుండం ఏర్పాటుచేశారు. ఈఅగ్నిగుండంలో భవానీమాలాధారులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ ఛైర్మన్ మార్గాని సత్యనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యం లో భక్తులకు అల్పాహారాన్ని ఏర్పాటుచేశారు. వేమగిరితోట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఉన్న అమ్మవారు చండీమాతగా దర్శనమిచ్చారు.

రాజమహేంద్రవరంకల్చరల్(ఆంధ్రజ్యోతి): స్థానిక జైన్ రోడ్, షిరిడీసాయిమార్గ్‌లోని శ్రీ శివకామేశ్వరి పీఠంలో పీఠం అధిపతి ఈమని దక్షిణామూర్తి సిద్ధాంతి నేతృత్వంలో ఆదివారం అమ్మవారిని కూర్మావతారంలో అలంకరించారు.

గోదావరిలో స్నానాలకు అనుమతించొద్దు: ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో గోదావరిలో ఇద్దరు భవానీమాలదారులు స్నానాలకు దిగి మరణించడం చాలా దురదృష్టకరమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం పుష్కరాల రేవును ఆయన, పోలీస్, ఇరిగిషన్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ పరిస్థితిని పరిశీలించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పలు సూచనలు చేశారు. అనంతరం ఆదిరెడ్డి వాసు విలేకరులతో మాట్లాడారు. పుష్కరాల రేవులో నిత్యం పోలీస్ పహార ఉండాలన్నారు. భక్తులకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి ప్రవాహం అధికంగా ఉన్నందున పుష్కరాల రేవులో ప్రవాహం తగ్గేవరకు స్నానాలకు ఎవ్వరినీ అనుమతించవద్దని సూచించారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ అప్పారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇరిగిషన్ అధికారులు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, యిన్నమూరి దీపు, మాజీ కార్పొరేటర్లు మొకమాటి సత్యనారాయణ, కోరుమిల్లి విజయశేఖర్, రాచపల్లి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు. అలాగే భవానీలు గల్లంతైన పుష్కరాల రేవును అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు.



పుష్కరాల రేవును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాల

● ఆకట్టుకున్న మహిళల గ్రామోత్సవం

అనపర్తి సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ బతుకమ్మా ఉయ్యాల అంటూ పాటలు పాడుకుంటూ బతుకమ్మను పూజిస్తూ ఐదవ తనంకోసం పూజలు నిర్వహించడం ఇప్పటివరకు తెలంగాణా మహిళలకే పరిమితమైంది. బతుకమ్మను పూజించి అమ్మ ఆశీస్సులు పొందుతామని అనపర్తిలో ఆదివారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. సుమారు 100మంది మహిళలు బతుకమ్మలను తలకెత్తుకుని గ్రామోత్సవం నిర్వహించారు. అనపర్తిలోని త్రిశక్తి పీఠం ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ కర్రి శేషారత్నం నేతృత్వంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి ప్రతిరూపానికి బంతి, చామంతి, తంగేడు పూలను అలంకరించిన మహిళలు అమ్మవారిని తలకెత్తుకుని గ్రామోత్సవం నిర్వహిస్తూ ఎర్ర కాలువవద్దకు చేరుకుని అక్కడ బతుకమ్మలను ప్రతిమల చుట్టూ మహిళలు పాటలు పాడుతూ భక్తిభావంతో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం గోదావరి జలాలలో బతుకమ్మను నిమజ్జనంచేసి తమ భక్తిని చాటుకోవడమే కాకుండా తాము తెలంగాణా మహిళలకు తీసిపోమంటూ నిరూపించుకున్నారు.

పనిగంటల పెంపును ప్రభుత్వం విరమించుకోవాలి

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పనిగంటల పెంపును కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, కేశవరం బాటిలింగ్ యూనిట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పనిగంటల పెంపును నిరసిస్తూ త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు.

రైతుల సంక్షేమం కోసం పనిచేయాలి: ఎమ్మెల్యే నల్లమిల్లి



రామవరంలో ఏఎంసీ డైరెక్టర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీకి జుత్తుక సూర్యకుమారి అధ్యక్షురాలిగా ఏర్పడిన నూతన కార్యవర్గం రైతుల సంక్షేమానికిపాటు పడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి ఏఎంసీకి నూతనంగా డైరెక్టర్లుగా ఎంపికైన ఇందల వీరబాబు, మద్దిపూడి సత్యనారాయణ, బోగాది వెంకటరమణ, గంగుమళ్ల వెంకట్ తలుపులమ్మలు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్లను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు రావాడ నాగు, పెదపూడి మండల టీడీపీ అధ్యక్షుడు జుత్తుక కృష్ణ ఉన్నారు.

రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని ధర్నా

గోకవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాగా ప్రకటించాలని కోరుతూ మండలంలోని రంపయర్రం పాలెం గ్రామంలో ఆదివారం ధర్నా కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు, ఉమ్మడి గోదావరిజిల్లాలోని సబ్‌ప్లాన్ ప్రాంతాలన్నింటినీ కలిపి రంపచోడవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాను ప్రకటించాలన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలోని సబ్‌ప్లాంట్ ఏరియాలోని గ్రామాలను ఈప్రత్యేక జిల్లాలో విలీనం చేయాలన్నారు. జిల్లాల పునర్విభజన కోసం ప్రభుత్వం మంత్రులతో ఒక సబ్ కమిటీని వేసిందని, కమిటీ ఈవిషయాన్ని గుర్తించాలన్నారు. వల్లూరి రాజబాబు, బి.రమేష్, కడితి సతీష్, రెడ్డి దుర్గాదేవి, చంద్రమ్మ, దుర్గ, వీరరాఘవమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ జ్ఞాపకాలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పర్యటించిన జ్ఞాపకాలు చిరస్మరణీయమని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. ఈమేరకు ఆదివారం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ప్రిన్సిపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 1944, సెప్టెంబరు 28న డాక్టర్ అంబేడ్కర్ బ్రిటీష్ వైస్రాయి కౌన్సిల్ మెంబర్, కేంద్ర కార్మిక శాఖ మంత్రి హోదాలో పర్యటించారని, ఆ చారిత్రాత్మక పర్యటనను గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్, తెలుగు విభాగాధిపతి పోలుమాటి అన్నవరం, సత్యనారాయణ, వీఆర్‌వో జిల్లా సురేష్, పూర్వవిద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి గద్దే సుధాకర్, కోశాధికారి ఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

వర్ధమాన కవులకు జాషువా సాహిత్యం స్ఫూర్తి

కడియం(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంఘిక, సామాజిక అంశాలను వెలిగెత్తి చూపించేందుకు గుర్రం జాషువా సాహిత్యం మార్గదర్శకమని జనవిజ్ఞానవేదిక పర్యావరణ రాష్ట్ర కోకన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు, చెళ్ళపిళ్ళ కమిటీ అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యంలు అన్నారు. ఆదివారం గిరజాల కృష్ణప్రసాద్ కళ్యాణమండపంలో జాషువా 130వ జయంతి కార్యక్రమం జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖకవి గండిస్వామిప్రసాద్‌కు గుర్రం జాషువా పురస్కారం అందజేసి సత్కరించారు. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కళాసేవాసమితి, జనవిజ్ఞానవేదిక, అరసం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాషువాతో పాటు భగత్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుపండితులు డి.నీలకంఠరావు, గొల్లపల్లి సత్యనారాయణ, న్యాయవాది తోరాటి వసంతరావు, జనవిజ్ఞానవేదిక జిల్లా కమిటీ ప్రతినిధులు మల్లిఖార్జునరావు, తాతారావు, తమ్మిశెట్టి ప్రసాద్, నిచ్చల్, చిక్కాల ఈశ్వరరావు, ఉంగరాల వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వైశ్యహాస్టల్ కమిటీ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరంసిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైశ్యహాస్టల్ నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం రాజమహేంద్రవరం మీనాక్షి కళ్యాణ మండపంలో జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో వైశ్యహాస్టల్ గౌరవాధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం సమక్షంలో జరిగాయి. కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన కోట్ల కనకేశ్వరరావు, గౌరవ కార్యదర్శిగా తవ్వా రాజా, కోశాధికారిగా మట్టే కాళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మండవిల్లి శివ, కార్యవర్గసభ్యులు, డోనర్స్ కమిటీ ఛైర్మన్ సత్యవరపు సత్యనారాయణ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయి ంచారు. దీనికి జిల్లా ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి, మాటూరి రంగారావు, బాలనాగు బలే ష గుప్తా, పొలసానపల్లి హనుమంతరావు, మన్యం బాబ్జి, గోకుల మురళీ, పీవీ స్వామి తదితర వైశ్యప్రముఖులు హాజరయ్యారు.

'జాతి గర్వించదగిన గొప్ప వ్యక్తి గుర్రం జాషువా'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని అసమానతలను ఎదుర్కొంటూ అద్భుతమైన పద్యరచనలు చేసిన గుర్రం జాషువా జాతి గర్వించగదగిన గొప్ప వ్యక్తి అని పలువురు పేర్కొన్నారు. జిల్లా బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో సమరసతా స్వరం, జాతీయతాగళం, మానవతా స్వరం పేరుతో కవికోకిల గుర్రం జాషువా 130వ జయంతి సభ నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సభలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకరశర్మ, నన్నయ విశ్వవిద్యాలయ తెలుగు ప్రొఫెసర్ తలారి వాసు, శతావధాని తాతా సందీప్ శర్మ, గూటం స్వామి, పెనుమాక రత్నాకర్, ఎంఆర్‌వీ సత్యనారాయణమూర్తి వక్తలుగా మాట్లాడారు. కవి పండితులను సత్కరించారు.

డీఎస్సీ విజేత శ్రీనుకు సత్కారం

కడియం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన సాదే శ్రీను మెగా డీఎస్సీ 2025లో పీఈటీ విభాగంలో మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడు. సీఎం చంద్రబాబునాయుడు నుంచి డీఎస్సీ నియామకపత్రం అందుకున్నారు. ముందుగా డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈమేరకు సాదే శ్రీనును గ్రామానికి చెందిన అంబేడ్కర్ యూత్, గ్రామస్థులు కలిపి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముంగమూరి చినబాబు, మెల్లిమి గంగరాజు, తూలూరి శేషయ్య, జీవీ సత్యనారాయణ, అంబేడ్కర్ యూత్, గ్రామస్థులు ఉన్నారు.

ప్రపంచ గుండె అవగాహన దినోత్సవం

రాజమహేంద్రవరంకల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ గుండె అవగాహన దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని వాకర్స్ క్లబ్ సభ్యులు, పల్స్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన త్రీకేనడక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజలకు గుండెజబ్బుల గురించి అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణంరాజు, లక్ష్మణ్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని కలిసిన టీకే

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి కలిశారు. ఈ మేరకు రాజమండ్రిలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ సైదాలతో కలిసి విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు.

భగత్ సింగ్‌కు నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శమని సీపీఐ సీనియర్ నాయకులు నల్లా రామారావు అన్నారు. భగత్‌సింగ్ జయంతిని రాజేంద్రనగర్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. బళ్ళా శ్రీనివాసరావు, నల్లా భ్రమరాంబ, బొట్టా వీరబాబు, కె.శ్రీనివాస్,బవర్రాజు, నూకరాజు పాల్గొన్నారు.

అక్టోబరు 9,10 తేదీల్లో
గైట్‌లో జాతీయస్థాయి వర్క్‌షాప్

రాజానగరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశీయ ఆరోగ్య పరిజ్ఞానం, మహిళా వైద్యులు సాంప్రదాయ పద్ధతులు, ప్రజారోగ్య ఏకీకరణపై అధ్యయనం అనే అంశంపై గైట్ డిగ్రీ కళాశాలలో అక్టోబరు 9,10 తేదీల్లో జాతీయస్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి తెలిపారు. ఇందుకు సంబంధించిన పో స్టర్‌ను జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ప్రోఛాన్సలర్ శశికిరణ్‌వర్మ, ఉపకులపతి యు.చంద్రశేఖర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృత భాషను ఆధారంగా చేసుకుని రెండు రోజులపాటు ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు, వైద్యనిపుణులు, ఆధునిక, ఆయుర్వేదం తదితర అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తారన్నారు. ఈసమావేశంలో కె.విజయభాస్కరరాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, కేబీఆర్ వర్మ, డైరెక్టర్ అడ్మిన్, ఎం.శ్రీనివాసరావాడు, డీన్ ఆర్ఎస్ రాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

S.O.P. No. 3/2025

Between:
1. Smt. Goje Annapurnadevi
2. Goje Eswara Prasad
3. Goje Yesaswi Srilakshmi Bai
(Petitioner No.3 being minor represented by mother and next friend 1st Petitioner) ...*Petitoners*

AND

1. The Branch Manager, SBI Funds Management Limited, #6-13-2, , Ground Floor, Opposite: RK Honda Showroom, Kankatalavari Street, T.Nagar, Rajamahendravaram, E.G.District.
2. The Authorised Signatory, Computer Age Management Services Limited, Unit: SBI Mutual Fund, Rayala Towers, 158 Anna Salai, Chennai. ...*Respondents*

జనరల్ నోటీసు

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయు నదిఏమనగా, పై గ్రంధంలో చనిపోయిన గోజే శివశంకర కళ్యాణ్ గారికి రావలసిన ప్రతిఫలములు పిటీషనర్స్‌కి దాఖలు పడినవి. సదరు పైన తెలిపిన రెస్పాండెంట్లు ఉత్తర్వులు మేరకు పై పిటీషనర్స్ వారసులు అని సక్సెషన్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం S.O.P. దాఖలు చేసియున్నారు. కావున పై నెంబరు S.O.P. లో ఎవరికైన అభ్యంతరములు ఉన్న యెడల ది. 17-10-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టులో తెలియపర్చు కోవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

జి.వి.ఆర్.మూర్తి, అడ్వకేటు
రాజమండ్రి 28-9-25 | రాజమండ్రి సెల్:9347394147





కరుణించు.. కనకదుర్గమ్మ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. పెద్ద ఎత్తున భక్తజనం తరలివస్తున్నారు. దీంతో జంక్షన్ జనంతో కిటకిటలాడుతోంది. ఆదివారం ఉదయం 108 మంది దంపతులు కుంకుమ పూజలు చేశారు. ఉత్సవంలో తప్పిపోయిన బాలుడిని సెంట్రల్ జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీకాంత్ చేరదీసి ధైర్యం చెప్పారు. కొద్ది సేపటి తర్వాత ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.







అమ్మా.. కోటసత్తెమ్మ

ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది.. భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేస్తున్నారు. నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయంలో 7వ రోజు ఆదివారం 417 మంది దంపతులు కుంకుమ పూజలు చేశారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. చాగల్లు కోమటిచెరువు రామాలయం వద్ద మహిళలు కలశాలతో భారీ ఎత్తున ఊరేగారు.

సచివాలయ ఉద్యోగుల ఉద్యమం కొనసాగిస్తాం

జిల్లా శాఖ ఛైర్మన్ రామదాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విలేజ్ వార్డ్ సెక్రటేరియట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ఆత్మగౌరవం కోసం పోరాటం కొనసాగిస్తామని ఆ శాఖ జిల్లా ఛైర్మన్ వి.రామదాసు స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం జరిగిన జిల్లా శాఖ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్బంధంగా అమలుచేస్తున్న ఇంటింటి సర్వేలు సచివాలయ ఉద్యోగులపై భారమై అనేక అవమానాలకు గురిచేస్తున్నాయన్నారు. సర్వేల నిలుపుదల జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.రవికుమార్, కె .వెంకటేశ్వరరావు, డి.భగవాన్‌దాస్, ఎం.ఇందిర , పి.గోపాలకృష్ణ ,కె.దినేష్, 19 మండల కమిటీల నాయకులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు గురైతే వైద్యం తప్పనిసరి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుక్క కరచిన వెంటనే వైద్యసాయం తీసుకోకపోతే రేబిస్ ముప్పు పొంచి అధికమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రపంచ రేబిస్ డేను పురస్కరించుకుని ఆదివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో వీధి కుక్కలతో పాటు ఇంటిలోని పెంపుడు కుక్కల కాట్లు పెరుగుతున్నాయన్నారు. రేబిస్ వ్యాధిపట్ల నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకమవుతుందన్నారు. తలనొప్పి, తీవ్రమైన జ్వరం, ఆందోళన, లాలాజల పక్షవాతం, గొంతు కండరాల సమస్యలు వంటి లక్షణాలు తుది దశలో ప్రాణాంతకమని హెచ్చరించారు.వైద్యశాఖ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



తగ్గేదేలే!

ఇంకనూ తగ్గని పన్నుపోటు

- ఆగని వ్యాపారుల దోపిడీ
- పాత ధరలే కొనసాగింపు
- దసరా ఆఫర్లుగా ప్రకటనలు
- ఎమ్మార్పీపై పాత జీఎస్టీ అమలు
- వారమైనా మారని పరిస్థితి
- తగ్గని పాల ప్యాకెట్ ధర
- తనిఖీలు చేపట్టని అధికారులు
- అవగాహన సదస్సులతో సరి
- మోసపోతున్న కొనుగోలుదారులు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వచ్చి వారం దాటింది. ఈ నెల 22 నుంచి సుమారు 83 కేటగిరీలకు సంబంధించిన వస్తువులు,సేవలు, మందులపై కేంద్రం జీఎస్టీ శ్లాబ్ తగ్గించిన సంగతి తెలిసిందే. గతంలో నాలుగు శ్లాబ్‌లు ఉంటే.. ప్రస్తుతం రెండు శ్లాబ్‌లకే పరిమితం చేశారు. కానీ ఎక్కడా ఇవి పూర్తి స్థాయిలో అమల్లోకి రావడంలేదు. వ్యాపారులు అసలు ధరలు చెప్పడం లేదు. పాత సరుకు ఉందనే కారణంతో పాత ధరలే వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ పరి స్థితుల్లో పాత సరుకు ఎంత ఉందో చెప్పే వారెవరూ కనిపించడంలేదు. తగ్గిన జీఎస్టీ శ్లాబ్ వల్ల ప్రజలకు ఎప్పటికి ప్రయోజనం లభిస్తుం దనేదానిపై స్పష్టత లేదు.

దసరా ఆఫర్ల పేరు..

టీవీలు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, మోటారు సైకిళ్లపై కొంత వరకూ తగ్గినట్టు చెబుతున్నారు. కార్లపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ తగ్గగా మోటారు సైకిళ్లపై రూ.15 వేల వరకూ తగ్గింది. టీవీలపై రూ.3 వేల నుంచి రూ. 4 వేల వరకూ తగ్గిస్తున్నారు. కానీ ఇవన్నీ దసరా ఆఫర్లతో కలిపి అమ్ముతున్నట్టు వ్యాపారులే చెబుతున్నారు. అంటే దసరా ఉత్సవాల తర్వాత టీవీలు, ఏసీల వంటి ధరలు కొద్దిగా పెరిగే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. సిమెంట్ ధరలు తగ్గించడం లేదు. పాల ఉత్పత్తుల వద్ద ధరల పట్టీలు పెట్టారు. కానీ పాత సరుకు ఉందని చెప్పడం గమనార్హం.

కొత్త పథకం.. పాత ధర..

ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించిన 83 కేటగిరీల వస్తువులు, సేవలు వంటి వాటి వివరాలు ప్రకటిం చింది.వీటి ధరలు కచ్చితంగా తగ్గించాల్సిందే. పన్నీరు, టెట్రాప్యాక్ పాలు, చపాతీలు, రోటీలపై ఐదు శాతం జీఎస్టీ ఉండేది. దానిని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే వ్యాపారులు మాత్రం పాత ధరకే విక్ర యిస్తున్నారు.వెన్న, నెయ్యి, తృణధాన్యాలు, చక్కెర, కాఫీ, సూప్‌లు, బేకింగ్ ఫౌడర్, నిల్వ ఉంచిన చేప, మాంసం రేటపై జీఎస్టీ గతంలో 12 శాతం ఉండేది. ప్రస్తుతం కేవలం 5 శాతం వసూలు చేయాలి. 20 లీటర్ల తాగునీటి డబ్బాలు, కొబ్బరిపాలు, బాదం, జీడి పప్పు పాలు, అవిసెపాలు, బియ్యంపాలు , ఓట్ పాలు పండ్ల గుజ్జు, రసాలు, పాలు ఆధారిత పానీయా లపై గతంలో 18 శాతం జీఎస్టీ వసూలు చేసేవారు. ఈ శ్లాబ్‌ను 5కి పరిమితం చేశారు.

అసలు ఎంత తగ్గాయంటే!

- విద్యార్థులు ఉపయోగించే వ్యాయామం, ఎరేజర్లు, పుస్తకాలు, పెన్సిళ్లపై జీఎస్టీని ఎత్తేశారు.జామెట్రీ, రంగు పెట్టెలు,పేపరు కార్టూన్లు తదితర వస్తువులపై 12 శాతం ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.
- అరుదైన వ్యాధులకు సంబంధించిన మందు లపై పూర్తిగా జీఎస్టీ ఎత్తేశారు. యునాని, సిద్ధ, హోమియోపతి సహా అన్ని మందులు, ఆక్సిజన్ కిట్లు, రసాయనాలు,గ్లూకోమీటరు,సర్జికల్ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.థర్మామీటరుపై 18 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- వ్యవసాయ పరికరాలు,యంత్రాలపై గతంలో 12, 18 శాతం జీఎస్టీ ఉండేది.. మొత్తం 5 శాతానికి తగ్గించారు. వ్యవసాయ సంబంధిత పరికరా లు ఏం కొన్నా 5 శాతమే వసూలు చేయాలి.
- వాహనాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. సైకిళ్లు,వాటి భాగాలపై 12 శాతం ఉంటే 5శాతానికి పరిమితం చేశారు.
- సిమెంట్‌పై జీఎస్టీ 28 శాతం ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. మిగిలిన గృహ నిర్మాణ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- టీవీలు, ప్రొజెక్టర్లు, ఏసీలు, డిష్ వాషర్లపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే దానిని 18 శాతానికి పరిమితం చేశారు.సోలార్ వాటర్ హీటర్, సిస్టమ్స్ ,సోలార్ కుక్కర్లపై 12 శాతం ఉంటే 5శాతానికి పరిమితం చేశారు.
- బొమ్మలు, క్రీడాపరికరాలు, చేతిపనుల వస్తువులపై 5 శాతమే.
- ఫీడింగ్ బాటిళ్లు,స్టీల్, అల్యూమినియం, రాగి వంటి పాత్రలు, ఫీడింగ్ బాటిళ్లు, బేబీ న్యాప్ కిన్‌లు,డైపర్లు, కొవ్వొత్తులు, స్టీలు, అల్యూ మినియం,రాగి ఇత్తడి,వంటగది పాత్రలు,కుట్టు యంత్రాలు, రబ్బరు బ్యాండ్లపై 12 శాతం జీఎస్టీని 5శాతానికి పరిమితం చేశారు.
- కాఫీ, చాకెట్లు, పేస్ట్రీ, కేక్‌లు, బిస్కెట్లు, జామ్‌లుపై గతంలో 18శాతం జీఎస్టీ ఉండేది.దానిని 5 శాతానికి పరిమితం చేశారు.బాదం, పిస్తా, హాజెల్ నట్స్, ఖర్జూరం, అంజీర్ మొదలైన డ్రైఫ్రూట్లు, పాస్తా,మాకరోనీ, నూడుల్స్, ఊరగాయలు, పండ్లు, కూరగాయల రసాలపై గతంలో 12 శాతంగా ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.
- సబ్బులు,హెయిర్ ఆయిల్, షాంపూలు, దువ్వెనలు, ఫౌడర్లపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గింది. టాల్కర్, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్ షేవ్ లోషన్లపై 18 శాతం ఉంటే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు. పన్ను తగ్గించినా వ్యాపారులు ఇంకా పాత పన్ను విధానమే అనుసరిస్తున్నారు.



18 వరకూ అవగాహన సదస్సులు

ఏ వస్తువుపై ఎంత జీఎస్టీ అనేది ప్రభుత్వం ప్రకటించింది. వినియోగదారులు వాటి పట్ల అవగాహన చేసుకుంటే మార్కెట్‌లో ఏ వస్తు వుకు ఎంత తగ్గిందో అడిగి కొనుక్కోవచ్చు. 22వ తేదీకి ముందు ఎమ్మార్పీని ఇవాళ ఉన్న ఎమ్మా ర్పీతో అవగాహన చేసుకుంటే వ్యాపా రులు దిగొస్తారు.లేకపోతే దోపిడీ తప్పదు. ఈ మేరకు అధికార యంత్రాంగం అవగాహన సదస్సులు చేపడుతోంది. వచ్చే నెల 18వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది.19న సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరిట దీపావళిని ఒకరోజు ముందుగానే నిర్వహించనున్నారు.



ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు సమ్మె నోటీస్ అందజేస్తున్న వైద్యులు

నేడు పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

సమ్మెలోకి ఆసుపత్రుల వైద్యులు

నల్లజర్ల,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) విధిలేని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళుతున్నట్టు నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధర్, డాక్టర్ సిరాజుద్దీన్ తెలిపారు.తమ సమస్యలతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు అందజేసి మాట్లాడారు. జీవో నెంబరు 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని,అలవెన్స్‌లు అందించాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్ చేస్తున్నామన్నారు. 30,1న జిల్లా కేంద్రాల్లో నిరసనలు, 3న విజయవాడలో నిరసన, నిరహార దీక్షలు చేస్తామన్నారు. కార్య క్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్, మండల స్థాయిల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ సమస్యలు,అభ్యర్థనలు మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల స్వీకరణకు రాత సహాయకులు,రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.



ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

పోటీలు హోరాహోరీగా సాగాయి.. క్రీడాకారులు నువ్వా నేనా అంటూ తలపడ్డారు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2025 ముగిశాయి. మహిళల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సూర్య చరిష్మా, పురుషుల సింగిల్స్‌లో భరత్ రాఘవ్ విజయం సాధించారు. ఆదివారం ఫైనల్ పోటీలు జరిగాయి. విజేతలకు శాప్ ఛైర్మన్ రవినాయుడు బహుమతులు అందజేశారు. - రాజమహేంద్రవరం అర్బన్

అపూర్వ కలయిక!

వాళ్లంతా స్నేహితులే.. 21 ఏళ్ల కిందట 1999 నుంచి 2004 వరకూ గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు.. తరువాత కొంత మంది కలిసి చదువుకుంటే.. మరికొంత మంది వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు.. దసరా సందర్భంగా ఆదివారం కలుద్దామని అనుకున్నారు.. సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 20 మాస్టార్లను సత్కరించారు. సాయంత్రం వెళ్లొస్తాం అంటూ కన్నీటిని దాచుకుంటూ ఎవరికి వారు ఇళ్లకు పయనమయ్యారు. - గోకవరం



తగ్గని గోదావడి!



ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద వరద ఉధృతి



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరద ఉధృతి

- ఉధృతంగా గోదావరి
- కొనసాగుతున్న ఫస్ట్ వార్నింగ్
- మరో రెండు రోజులు వరద
- ఎగువున వర్షాలే కారణం

రాజమహేంద్రవరం/కొవ్వూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గోదావరి ఇంకా ఉధృతంగానే ప్రవహిస్తోంది. అఖండ గోదావరి ఘాట్లన్నీ వరద నీటితో నిండి ఉన్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. అఖండ గౌతమీ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. స్నానఘట్టాల మెట్లను ముంచుతూ, సుడులు తిరుగుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాలపై ఉన్న శివలింగాలను వరద ముంచెత్తింది. భద్రాచలం నుంచి వరద ప్రవాహం ధవళేశ్వరం బ్యారేజ్‌కు చేరుకోవడానికి 18 గంటల సమయం పడుతుంది.ధవళేశ్వరం వద్ద నెమ్మదిగా తగ్గుముఖం పడుతోంది. మొదటి ప్రమాద హెచ్చరిక ఇంకా అమల్లోనే ఉంది. బ్యారేజీ వద్ద ఆదివారం ఉదయం 6 గంటలకు 12.50 అడుగులుగా ఉన్న నీటిమట్టం నెమ్మదిగా తగ్గుతూ రాత్రి 8 గంటలకు 12 అడుగులకు చేరింది.సోమవారం ఉదయానికి మొదటి ప్రమాద హెచ్చరిక ఎత్తివేసే అవకాశం ఉంది.బ్యారేజి నుంచి దిగువకు 10 లక్షల, 9 వేల 208 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. రాజమహేంద్రవరం పుష్క రఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం ఇద్దరు భవానీ మాలధారులు గల్లంతు కావడంతో ఘాట్ల వద్ద అధికారులు అప్రమత్తమయ్యారు. ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రమాద హెచ్చరిక ఎత్తివేసినా ఇంకా కనీసం రెండు రోజుల పాటు ఈ ఉధృతి కొనసాగే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.



ఉధృతంగా ఉన్నా గోదావరిలోనే భవానీల స్నానాలు

ఇంకనూ లభించని ఆచూకీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పుష్కరాల రేవు వద్ద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన భవానీమాలధారుల కోసం అగ్నిమాపక శాఖ సిబ్బంది,మత్స్యకారుల సహకారంతో గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది.మాలధారులు వీరబాబు, బాపిరాజు శనివారం సాయంత్రం గోదావరిలో గల్లంతైన విషయం విధితమే. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పుష్కరాల రేవు వద్ద వారి బంధువులు గల్లంతైన వారి కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఆదివారం రాత్రి వరకు రాలేదు. గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో పుష్కరాల రేవు నుంచి దిగువకు గాలింపు చర్యలు చేపడుతున్నారు.పుష్కరఘాట్‌ను ఆదివారం రాజమహేంద్రవరం, అనపర్తి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్,నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు.గోదావరికి వరద ఎక్కువగా ఉన్నందువల్ల స్నానాలకు వచ్చే భక్తులు మునిసిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ట్యాప్‌ల వద్ద స్నానాలు చేయాలని తెలిపారు.అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి


కలెక్టర్ కీర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కీర్తి చెకూరిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితో పాటు పరిష్కరించాల్సిన సమస్యలపై కలెక్టర్‌తో సమీక్షించారు.

రైళ్ల హాల్ట్ కోరుతూ యోగాసనాలతో నిరసన


యోగాసనాలు వేస్తూ నిరసన తెలుపుతున్న రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్‌కి ముందు ఆగే రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని ప్రణవ సంకల్ప యోగా సమితి ఆధ్వర్యంలో ఆదివారం యోగాసనాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేశాఖ దేశ వ్యాప్తంగా హాల్ట్‌లు కల్పిస్తూ కొవ్వూరు స్టేషన్‌పై మాత్రం సవతితల్లి ప్రేమను చూపిస్తోందని రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు విమర్శించారు. ఇకనైనా రద్దుచేసిన అన్ని రైళ్లను నిలుపుదల చేయాలని డిమాండ్‌చేశారు. దుద్దుపూడి గణేష్, పొట్నూరి చెల్లేశ్వరి, పిన్నింటి భరత్, రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు హాజీబు జగన్నాథరావు, గారపాటి మోహనరావు, వీటీ విల్సన్ రాజు, చామర్తి కామేశ్వరరావు, సత్యనారాయణ రాజు, గణేష్, వైకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పుస్తకావిష్కరణ


కృష్ణంపాలెంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జనసేన పార్టీ నేత సువర్ణరాజు

దేవరపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమం లేని సమాజం నిర్మించాలనే ఆలోచన గొప్పదని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు పేర్కొన్నారు. కృష్ణంపాలెంలోని వృద్ధాశ్రమంలో ఆదివారం బంధపురం గ్రామానికి చెందిన పెదవేగి సత్యప్రకాశ్ రాసిన వృద్ధాశ్రమం అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సమాజంలో తనకంటూ తోడుగా ఎవరూ లేనివారికి వృద్ధాశ్రమం అవసరం ఎంతైనా ఉందన్నారు. రచయిత పెదవేగి సత్యప్రకాశ్ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఉన్నవారి బాధలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకం రచించినట్టు తెలిపారు. ఈ పుస్తకాన్ని చదివిన తరువాత ఒక్కరైనా మారినా రచయితగా నేను గెలిచినట్లేనని అన్నారు. కార్యక్రమంలో జనసైనికులు కంబాల సత్తిబాబు, రమేష్, బాబీ, గంగరాజు, పసుపులేటి శివ నాగప్రసాద్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థలపరిశీలన

దేవరపల్లి, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): త్యాజంపూడిలో రూ. 48 లక్షల 40 వేలతో వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎన్.పార్వతి తెలిపారు. ఆదివారం దానికి సంబంధించిన స్థలాన్ని డీఈ, కూటమి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భగా గ్రామ టీడీపీ అధ్యక్షుడు అక్కిన భూపతిరావు, సొసైటీ చైర్‌పర్సన్ కొడూరి వెంకటరత్నం మాట్లాడుతూ 2022లో జలజీవన్ మిషన్ నిధుల మంజూరయ్యాయని, అనేక పర్యాయాలు టెండర్లు పిలిచినప్పటికీ ఖరారు కాకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. మళ్లీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చొరవతో టెండర్లు పునరుద్ధరించి 60వేల లీటర్ల ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించటం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కుమారి, జనసేన ఎంపీటీసీ కాళ్ల వెంకట రత్నం, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తలో ఉచిత వైద్యశిబిరం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మోర్తలో తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఆలపాటి నరేంద్ర సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 150 మంది రోగులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ హుస్సేన్ అహ్మద్ నేత్ర సేవలు, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య, తదితరులు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కోసం ఆర్థిక సహాయం

తాళ్లపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థికి ఆదివారం వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో 2016లో పదో తరగతి చదివిన విద్యార్థి గుండేపల్లి సునీల్ కుమార్ హీమోఫీలియా అనే వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి పూర్వ విద్యార్థి సంఘం తరపున రూ.17వేలు అందించారు. అడ్డాల డేవిడ్‌రాజు, మారిశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహా చండీ నమోస్తుతే

● కొవ్వూరులో భక్తులకు దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరి అమ్మవారు ● పలుచోట్ల మహిళల విశేష పూజలు


గోష్పాదక్షేత్రంలో పూజలు చేస్తున్న మహిళలు

కొవ్వూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరి అమ్మవారు మహా చండీ మాత అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని మహా చండీమాతగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమపూజలు చేశారు. భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు మహా చండీమాతగా అలంకరించి పూజలు చేశారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు పర్యవేక్షణలో వాసవిట్రస్టు అధ్యక్షులు పెరుమాళ్ల వీరేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నపూర్ణాదేవిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. చిన్నారులను, మహిళలను నవదుర్గలుగా అలంకరించి పూజలు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొని వాసవీమాతను దర్శించుకున్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని చండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మూడుబొమ్మల సెంటర్ వద్ద సౌభాగ్యదుర్గాంబిక ఆలయం వద్ద వేదపండితులు పెడసనిగంటి సాయిబాబు, పెడసనిగంటి శశికాంత్‌శర్మ ఆధ్వర్యంలో హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పిన్నమని ప్రసాద్, సత్యనాగిని దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కుంకుమపూజలు నిర్వహించి అమ్మవార్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చాగల్లు: మండలంలో దేవీ శరన్నవరాత్రులు వేడుకగా జరుగుతున్నాయి. ఆదివారం చాగల్లులో గ్రామదేవత పాటెమ్మవారిని (పురాతన ఆలయం) ఉత్సవాల్లో భాగంగా పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. భవానీమాలధారులైన భక్తులు గరగలు నెత్తిన ధరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోమటి చెరువు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మవారిని పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. సెంటర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి.

'మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఏబీసీడీ వర్గీకరణ'


ఉప్పరగూడెంలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు


గోపాలపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలపాటు నిర్విరామంగా కొనసాగిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఏబీసీడీ వర్గీకరణ అని ఏపీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకట్రాజు మాదిగ అన్నారు. ఆదివారం స్థానిక ఉప్పరగూడెంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుపై ఆమోదం తెలిపిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి అధ్యక్షులు మద్దిపాటి రాంబాబు, ఉభయ గోదావర జిల్లాల ఇన్‌చార్జ్ గెల్లా శ్రీనివాస్; గోపాలపురం మండల అధ్యక్షుడు వీరపల్లి నవీన్, సోసల్ మీడియా కన్వీనర్ ప్రత్తిపాటి సూరజ్, తానేటి రాజేశ్, ఆకుమర్తి సురేశ్, తానేటి క్రాంతి, పల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'


త్యాజంపూడిలో చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

దేవరపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని రైతు సంఘం సీనియర్ నాయకుడు ఉండవల్లి కృష్ణారావు పేర్కొన్నారు. త్యాజంపూడి గ్రామంలో ఆదివారం భగత్‌సింగ్ 118వ జయంతిని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ అతిచిన్న వయస్సులో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ ఉద్యమం ద్వారా పోరాటం చేశామన్నారు. ఇంక్విలాబాద్ జిందాబాద్ అనే నినాదాన్ని దేశప్రజలకు అందించారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్, సీఐటీయూ నాయకులు ఎస్.భగత్, అయినపర్తి శ్రీనివాసరావు, పరపతి సోమశేఖర్, సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి గాంధీ బొమ్మ సెంటరులో భగత్ సింగ్ జయంతిని వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు చిరవూరి పోసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ మాట్లాడుతూ సర్దార్ కిషన్ సింగ్, వేదావతికు భగత్‌సింగ్ 1907 సెప్టెంబరు 28న జన్మించాడన్నారు. కార్యక్రమంలో గోకవరపు జితేంద్ర రవి, పోసిబాబు, అప్పన అనిల్, రామారావు, తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.





జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

దేవరపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 28, 29 తేదీల్లో జరిగిన 35వ సీనియర్ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో బాలురు, సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం బాలురు, బాలికలు తృతీయ స్థానం సాధించారని శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడల్లో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులంతా దేవరపల్లికి చెందినవారేనని ఆయన చెప్పారు. విజయం సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో వచ్చేనెల 23 నుంచి 27 వరకు గోవాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇందులో లక్కా గణపతి, చింతపల్లి సతీశ్, పట్టంశెట్టి సాయి, కుక్కల పవన్‌కుమార్, తంగెళ్ల వంశీ, ఉన్నారు. వీరిని దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి ఎన్. రవికిషోర్ అభినందించారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

కొవ్వూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో గుర్రం జాషువా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ సెంటర్‌లో ఉన్న జాషువా విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమి రాధ, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ముదునూరి నాగరాజు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, విగ్రహ కమిటీ అధ్యక్షుడు వరిగేటి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.





వాసవీ గవర్నర్‌గా రవికుమార్ ఏకగ్రీవం



నిడదవోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్య వైశ్య ప్రముఖుడు, టీడీపీ నేత కేదారిశెట్టి రవికుమార్ వీ202ఏ వాసవీ జిల్లా గవర్నర్‌గా 2026 సంవత్సరానికి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు నిడదవోలు వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల సతీష్ తెలిపారు. ఆదివారం కోనసీమ జిల్లా అంతర్వేదిలో జరిగిన వాసవీ కేబినెట్ మీటింగ్‌లో జిల్లా వాసవీ గవర్నర్‌గా రవికుమార్ నామినేషన్ వేశారు. ఒకే ఒక్క నామినేషన్ రావడంతో ఏకగ్రీవమైంది. మడిపల్లి భాస్కరం, కొనిజేటి సురేష్ కుమార్, కొనిజేటి మాల్యాద్రి, జీ.సత్యనారాయణ, బచ్చు సుమన్ కుమార్, బచ్చు నాని, పలువురు అభినందించారు.

దొమ్మేరులో రక్తదానం


రక్తదానం చేస్తున్న దాతలు

కొవ్వూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దొమ్మేరులో ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 40 మంది పాల్గొని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యుడు పరశురామ్, సిబ్బంది పాల్గొని వైద్యసేవలు అందించారు. రక్తదానం చేసిన దాతలకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సూరిబాబు, చంద్రమౌళి, కేవీకే రంగారావు, రామచంద్రరాజు పాల్గొన్నారు.

జనసైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నేత సువర్ణరాజు

దేవరపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి జనసేన పార్టీ ముందుం టుందని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు పేర్కొన్నారు. దేవరపల్లికి చెందిన కార్యకర్త కొడమంచిలి సూర్యచంద్రం ఇటీవల మృతిచెం దటంతో ఆయన కుటుంబాన్ని సువర్ణరాజు ఆదివారం పరామర్శించి రూ. 12 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు పసుపులేటి ప్రసాద్, కంబాల సత్తిబాబు, కొడమంచిలి శ్రీను, కొండపల్లి రమేశ్, దాసరి శేషారావు, మాదవరపు వెంకటేశ్వరరావు, జాజిమొగ్గల శ్రీనివాస్, దుగ్గిన గంగాధర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఊనగట్ల సొసైటీ మహాజన సభ

చాగల్లు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఊనగట్ల విశాల సహకార పరపతి సంఘం మహాజన సమావేశం సోమవారం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర తెలిపారు. సొసైటీ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, దీనికి సంఘ సభ్యులందరూ విధిగా హాజరు కావాలని ఒక ప్రకటనలో కోరారు.

ఉచిత వైద్యశిబిరం

సమావేశంతో పాటు సొసైటీ ఆవరణలో ఉచిత వైద్యశిబిరం జరగనుంది. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతులమీదుగా శిబిరం ప్రారంభం కానుంది. కంటి పరీక్షలు, మహిళల సమస్యలు సహా అన్నిరకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు.





చట్టాలపై అవగాహన అవసరం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవల కమిటీ తణుకు ప్యానెల్ న్యాయవాదులు కామన మునిస్వామి, కొరు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం పసలపూడి ప్రజలకు న్యాయసేవలు, చట్టాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ న్యాయసేవల సంస్థలు అందిస్తున్న ఉచిత న్యాయసలహాలను పొందాలన్నారు.

పేకాట శిబిరంపై దాడి

తాళ్లపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అన్నదేవరపేటలో పేకాట ఆడుతున్నారని ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ టీ. రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఇందులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3850 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

